గణనాథుడి కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉంది



కార్యక్రమంలో పాల్గొన్న సునీత మహేందర్‌రెడ్డి, శేరి సతీష్

కూకట్‌పల్లి: గణనాథుని కృపతో రాష్ట్రంలో అన్ని వర్గాలు సుభిక్షంగా ఉన్నాయని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. కూకట్‌పల్లి టెంపుల్ బస్టాప్‌లో కేపీహెచ్‌బీ కాలనీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద కుంకుమ పూజ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి సతీమణి శేరి మమతా ఆధ్వర్యంలో ముత్తయిదువులచే కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పట్నం సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గణనాథుని కృపా కటాక్షాలతో తెలంగాణ రాష్ట్రంలో కురిసిన వర్షాలకు ఎక్కువ నష్టం జరగకుండా బయట పడగలిగామన్నారు. వినాయక మండపంలో సనాతన ధర్మాన్ని పెంపొందించే విధంగా మన సంస్కృతిని గౌరవించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి ఔత్సాహిక కళాకారుల్లో నెలకొన్న సృజనాత్మకతను వెలికితీయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవ్ రావు, అరవింద్ రెడ్డి, రేష్మ, రజిత, జోజమ్మ, దేవ సహాయం, రవి, లక్ష్మీనారాయణ, అబ్దుల్ బాకీ, గోవింద గౌడ్, రాజేష్‌గౌడ్ రాజు, రాజు ముదిరాజ్, పి గోపాల్ చౌదరి, రామకృష్ణ రెడ్డి, లక్ష్మీ, ఆర్‌కె సుభాష్ పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం రానివ్వొద్దు



పైప్‌లైన్ లీకేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్‌లో నెలకొన్న మంజీరా ప్రధాన పైపు లైన్ లీకేజీ సమస్యను వాటర్‌బోర్డు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరగా మరమ్మతు పనులు పూర్తి చేసి నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను కోరారు. ప్రతి కాలనీ, బస్తీల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగరాదన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్పొరేటర్ వెంట డీజీఎం భాస్కర్, నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, డిఇ రమేష్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



హిందీ దివస్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 14 సెప్టెంబర్ 1949 భారత రాజ్యాంగం ప్రకారం హిందీ భాషను రాజ, జాతీయ భాషగా గుర్తించారు. హిందీ భాషాకు ఉన్నటువంటి ప్రాముఖ్యతను ప్రధానోపాధ్యాయులు నరేందర్ రెడ్డి విద్యార్థులకు వివరించారు. హిందీ భాషను అందిపుచ్చుకొని నేటి యువత ఎన్నో పదవులను అధిరోహించటం జరుగుతోందన్నారు. హిందీ ఉపాధ్యాయులు వీఎస్ఎస్‌శర్మ మాట్లాడుతూ.. హిందీ నేర్చుకోవటం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని, ఒక ప్రాంతం వారి సంస్కృతిని మరో ప్రాంతం వారు సులువుగా తెలుసుకోవటం, నేర్చుకోవటం జరుగుతుందన్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ అభియాన్‌ను ముందుకు తీసుకోవటంలో హిందీ భాషా కీలకంగా పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వం, ఉపన్యాసం, చిత్రలేఖనం, కవిత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నజీముద్దీన్, మల్లారెడ్డి, గాయత్రి, సత్యనారాయణరెడ్డి, శంకరప్ప, ప్రవీణ్, మాణిక్యం, రామ్మోహన్, భాగ్యమ్మ, తక్కుబాయి, డార్కస్, ఉమా వసుంధర, దమయంతి, రాణి, శాంతి స్వరూపిణి పాల్గొన్నారు.



కూకట్‌పల్లి ఐడియల్ చెరువులో విగ్రహాల వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

శుద్ధి పనులు షురూ!

- ముగిసిన వినాయక నిమజ్జనాలు
- ఐడియల్ చెరువులో వ్యర్థాల తొలగింపు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడియల్ చెరువులో వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా ముగిశాయి. అధికారులు చెరువులో నిండిపోయిన స్టీల్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, చెత్తా చెదారాన్ని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. నిమజ్జనాల కోసం ఏర్పాటు చేసిన క్రేన్లను కూడా కొన్నింటిని తొలగించారు. ఇంకా వినాయక నిమజ్జనాలు జరుగుతుండటంతో మూడు క్రేన్లు అందుబాటులో ఉంచారు. నిమజ్జనాలు ప్రారంభమైన నాటి నుంచి ఎప్పటికప్పుడు చెరువులోని వ్యర్థాలను తొలగిస్తున్నప్పటికి ఇంకా చెత్తాచెదారం అలాగే ఉండిపోయింది. గురువారం ఉదయం వరకు వినాయక నిమజ్జనాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో చెరువులోని వ్యర్థాలను పూర్తిగా తొలగించే క్రమంలో అధికారులు ఉన్నారు.

వెయ్యి మెట్రిక్ టన్నుల పీఓపీ తొలగింపు..

చెరువుల పరిరక్షణ కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలు పూజించకుండా మట్టి విగ్రహాలను పూజించాలని ప్రతి సంవత్సరం అవగాహన కల్పిస్తున్నా ఎక్కువగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పూజిస్తున్నారు. కూకట్‌పల్లి ఐడియల్ చెరువులో గురువారం వరకు సుమారు వెయ్యి మెట్రిక్ టన్నుల ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను తొలగించామని అధికారులు తెలిపారు. నిమజ్జనం రోజు నుంచి ఎప్పటికప్పుడు కైతలాపూర్‌లోని డంపింగ్ యార్డుకు తరలించి అక్కడి నుంచి జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలించారు. గురువారం కూడా పీఓపీ తొలగింపు పనులు జరిగాయి. సుమారు రెండు లారీల స్టీల్ కూడా తొలగించామని అధికారులు తెలిపారు. చెరువును శుభ్రం చేసేందుకు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు.

7500కు పైగా విగ్రహాల నిమజ్జనం...

కూకట్‌పల్లి ఐడియల్ చెరువులో ఇప్పటివరకు సుమారు 7500కు పైగా విగ్రహాలు నిమజ్జనం అయ్యాయని పోలీసులు తెలిపారు. మూడవ రోజు నుంచి నిమజ్జనం ప్రక్రియ మొదలై గురువారం ఉదయం వరకు కొనసాగింది. అత్యధికంగా రాత్రి 12 దాటిన తర్వాత, తెల్లవారుజామున 8 గంల వరకు ఎక్కువగా వినాయక విగ్రహాల నిమజ్జనం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. బుధ, గురువారం కూడా వినాయక నిమజ్జనానికి అత్యధికంగా గణనాథులు వచ్చాయి. కొలనులో మూడు అడుగుల వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడంతో పాటు చెరువులో ఏడు క్రేన్ల సహాయంగా భారీ విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఆదివారం గణనాథుడి నిమజ్జనం

కూకట్‌పల్లి: బాలాజీనగర్‌లోని మన అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. 20వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంలకు మహిళల కోసం కుంకుమార్చన, 21న తెల్లవారుజామున 3 గంటలకు గణపతి హోమం, 22 ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిమజ్జన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య

మూసాపేట: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన బాపట్ల రాధకుమారి (41) పెళ్లికి ముందే స్కిజోఫ్రేనియా అనే మానసిక వ్యాధితో బాధపడుతుండేది. వ్యాధి కారణంగా ఆత్మ హత్య చేసుకోవాలనే ఆలోచనలు ఎక్కువగా ఉంటాయి. పెళ్లికి ముందే ఆమెకు చికిత్స చేసి తగ్గిన తర్వాత పెళ్లి చేశారు. ఆమె భర్తతో పాటు ఇద్దరు పిల్లలతో కలిసి మూసాపేటలోని రెయిన్ బో విస్టాస్‌లో నివసిస్తున్నారు. భర్త హైటెక్ సిటీలోని బ్యాంప్ ఆఫ్ అమెరికాలో పనిచేస్తున్నారు. చికిత్స చేయిస్తున్నా వ్యాధి తగ్గకపోవడంతో మనస్తాపానికి గురయ్యేది. ఈ క్రమంలో బుధవారం రాత్రి వేరే గదిలోకెళ్లి చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నం

పలువురి అరెస్టు



కాంగ్రెస్ నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

కూకట్‌పల్లి: రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నాంపల్లిలోని బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళ్తున్న పత్తికుమార్, మద్దూరి రాము, ముప్పూరి బాలరాజు, మాదారి శ్రీను, జిల్లా శివ, రాజు, శివ, చింటూలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య బద్ధంగా ఉండాల్సిన వ్యక్తి అప్రజాస్వామికంగా మాట్లాడటం బాధాకరమని ఆయనను వెంటనే బీజేపీ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రతిపక్ష హోదా కలిగిన రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఢిల్లీ మాజీ ఎమ్మెల్యే తన్వీందర్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించినట కుటుంబ రాహుల్ గాంధీ కుటుంబమని గుర్తు చేశారు.

28న జాతీయ లోక్ అదాలత్

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్‌లో ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. కోర్టు పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసులు, భార్యాభర్తల తగాదాలు, 498ఎ, డీవీసీ, మనీ రికవరీ, చెక్ బౌన్స్ కేసులు, రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించనున్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సంస్థ న్యాయ అధికారి, మూడవ అదనపు జిల్లా జడ్జి వెల్లడించారు.

అత్యుత్తమ అధ్యాపకుల జాబితాలో 29 మంది హెచ్‌సీయూ ప్రొఫెసర్లు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 29 మంది ప్రొఫెసర్లు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ అధ్యాపకుల జాబితాలో స్థానం పొందారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన ఐయోనిడిస్ ఇటీవల గ్లోబల్ టాప్ 2 శాతంను ప్రచురించడం మరో విశేషం. అంతర్జాతీయ స్థాయిలో రెండు శాతం మంది అధ్యాపకులలో హెచ్‌సీయూ నుంచి ప్రొఫెసర్లు గోవర్ధన్ మెహతా, ఎంఎన్‌వి ప్రసాద్, అత్తిపల్లి ఆర్‌రెడ్డి, ఏఎస్‌రాఘవేంద్ర, సోమ వేణుగోపాలరావు, ప్రమోద్ కె నాయర్, అశ్విని కె నంగియా, రాజదురై చంద్రశేఖర్, అనునయ్ సమంత, నాగేందర్ కుమార్ సూర్యదేవర, సతీష్ నారాయణ శ్రీరామ, అలోక్‌సింగ్, నియాజ్ అహ్మద్, ఎస్ఎన్‌కౌల్, డి నారాయణరావు, డాక్టర్ అరుణశ్రీ ఎం కల్లే, అప్పారావు పొదిలే, లలిత గురుప్రసాద్, దేవులపల్లి రామాచారి, కారుమూరి అశోక్, జి వైదీశ్వరన్, సచిన్ భలేకర్, సూర్య,, ఎస్ఆర్ శేట్యే, కెడిసేన్, డీవీ బసవయ్య, మారియప్పన్ పెరియస్వామి, సముద్రా నిల్‌పాల్, డాక్టర్ మేహనాథన్ ముతమిలరసన్ ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో

భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

కేపీహెచ్‌బీకాలనీ: బైక్‌పై వెళ్తున్న దంపతులను ఆటో ఢీకొట్టడంతో భర్త మృతి చెందగా, భార్య చికిత్స పొందుతున్న ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..ఎల్లమ్మ బండ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన భాషవేణి తిరుపతి (47), స్వరూప (40) దంపతులు. మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్ కార్యాలయంలో పనిచేస్తుంటారు. ఈ నెల 18న ఉదయం 6.30 తమ బైక్‌పై కార్యాలయానికి వెళ్తుండగా కేపీహెచ్‌బీ కాలనీ మెట్రో పిల్లర్ నంబర్ 733 వద్దకు రాగానే టీఎస్ 34 టీ 7799 నెంబర్ గల ఆటో వీరి బైక్‌ను ఢీకొట్టింది. గాయపడిన ఇద్దరిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తిరుపతి మృతి చెందగా, స్వరూప తలకు తీవ్ర రక్తస్రావం, కుడి భుజం విరగడంతో పాటు మెడకు బలమైన గాయంతో పరిస్థితి విషమంగా ఉంది. మృతుడి కుమారుడు చందు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మిలాద్-ఉన్-నబీ జల్సాలో పాల్గొన్న, బండి రమేష్

మోతీనగర్: మిలాద్ ఉన్ నబీ వేడుకలను గురువారం సఫ్దార్‌నగర్‌లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్ చేతులమీదుగా జులూస్ (ర్యాలీ)ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, అబ్దుల్ హమీద్, సయ్యద్ రియాజ్, అబ్దుల్ సలీం, షేక్ రఫిక్, మీర్జా అస్లాం బేగ్, మహమ్మద్ రఫీ, సలావుద్దీన్ పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో..

ఆల్విన్‌కాలనీ: మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని కేటీఆర్‌కాలనీ, పీజేఆర్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, దొడ్ల రామకృష్ణ గౌడ్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మార్నెళ్ల శ్రీనివాస్, శశి, మౌలానా, అనిల్‌యాదవ్, రహ్మాన్, సైదర్ ఆలీ, ఎండి జాఫర్, శ్రీను, యూసఫ్, ఇమ్రాన్, ఇస్మాయిల్, ఇర్ఫాన్, రాజు, మోహన్, రాజ్యలక్ష్మీ, అరుణ, పుట్టం దేవి, దుర్గ, సుజాత, మణెమ్మ పాల్గొన్నారు.

పీజేఆర్‌నగర్‌లో దర్గా ప్రాంగణంలో

ఆల్విన్‌కాలనీ: మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లిం సోదరులు జరుపుకొనే మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్‌లో ఉన్న దర్గా ప్రాంగణంలో గురువారం షౌకత్ అలీ మున్నా, ముజీబ్ నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ..ప్రేమ, సోదర భావం, ధర్మ చింతన ప్రతి మానవుడిలో ఉండాలన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. సర్వ మానవ సమానత్వం, శాంతి స్థాపనే లక్ష్యంగా సాగిన మహమ్మద్ ప్రవక్త బోధనలతో స్ఫూర్తి పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, దొడ్ల రామకృష్ణ గౌడ్, కాశీనాద్ యాదవ్, మార్నెళ్ల శ్రీనివాస్, ముర్తుజా, కై సర్, మల్లేష్, షాహీద్ అలీ, షకీల్ మున్నా,ఖాజా మియా, ఇంతియాజ్, మౌలానా, బషీర్, అస్లాం, అహ్మద్, సుల్తాన్, పాల్గొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లిలో..

ఓల్డ్‌బోయిన్‌పల్లి: మిలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకలలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్‌రావు, అశోక్, అస్లాం పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలోని వివిధ ప్రాంతాలలో ముస్లింలు నిర్వహించిన పీస్ ర్యాలీలో వారికి జ్యూస్, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ముస్లింలు చేస్తున్న మిలాద్-ఉన్-నబీ జల్సాలో పాల్గొనడం ఆనందంగా ఉందని బండి రమేష్ వెల్లడించారు. షేర్‌గల్లీ, బడే మజీద్, ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట, సమతానగర్, భవానీ నగర్ ప్రాంతాల మీదుగా నిర్వహించిన ర్యాలీకి బండి రమేష్ స్వాగతం పలికారు.



అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్, దొడ్ల రామకృష్ణ గౌడ్



అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

నివాళి



మాధవరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు దివంగత సింగిరెడ్డి మాధవరెడ్డి 15 వర్ధంతిలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, మాజీ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి దిరేష్ కుమార్, సీనియర్ నాయకులు గంధం రాజు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, సుబ్బు నాయుడు, రాజేష్ యాదవ్, రవి, చిట్టిబాబు, చలపతి రావు, వీరాంజనేయులు, షణ్ముఖం, విద్యాసాగర్ పాల్గొన్నారు.

అన్నదానం



కూకట్‌పల్లి: సేవ్ ఏ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీకాలనీలోని మైత్రీ చిల్డ్రన్స్ హోం, ఆల్విన్‌కాలనీ రాజేశ్వరి వృద్ధాశ్రమంలో గురువారం అన్నదానం నిర్వహించారు,. అమెరికాలోని న్యూజెర్సీలో ఉంటున్న శరత్ సూరగన, సుభాషిణి సూరగన దంపతుల విరాళంతో అన్నదానం చేసినట్లు సంస్థ వ్యవస్థాపకులు అధ్యక్షులు రాణా ప్రతాప్ తెలిపారు.

మార్కెట్‌లోకి థార్ రాక్స్ కారు



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని మహీంద్రా షోరూంలో గురువారం నూతన థార్ రాక్స్ కారును శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

నాలెడ్జి సిటీలో కొత్త కోర్సు

రాయదుర్గం: బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మేనేజ్‌మెంట్ కోర్సును మరింత సులభతరం చేయడానికి హైదరాబాద్ నాలెడ్జి సిటీలో గురువారం కొత్త అండర్ గ్రాడ్యుయేట్ కోర్సును ప్రారంభించారు. 12వ గ్రేడ్ తర్వాత విద్యార్థులకు అనుభవజ్ఞులైన విద్యావేత్తలు, రియల్‌టైమ్ వ్యవస్థాపకులు, సీఎక్స్‌ఓఎస్ ద్వారా బోధించడానికి మూడేళ్ల ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ కోర్సు వీలు కల్పిస్తుంది.



కేబినెట్ సబ్ కమిటీని వెంటనే రద్దు చేయాలి

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీని తక్షణమే రద్దు చేయాలని, జ్యుడీషియల్ కమిటీని వెయ్యాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధిలు డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రతినిధులు చెరుకు రాంచందర్, భావనా సాహెబ్, న్యాయవాది రత్నంలు మాట్లాడుతూ వర్గీకరణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్‌కమిటీలో ఒక్క మాల కులస్తునికి అవకాశం ఇవ్వలేదని, అగ్రవర్ణాల వారు, బీసీలు ఉన్నారని వెంటనే దాన్ని రద్దు చేసి జ్యుడీషియల్ కమిటీ వెయ్యాలని డిమాండ్ చేశారు. దళితుల్లో మాలల జనాభా తక్కువగా ఉందని, అవకాశాలు మాత్రం వారే ఎక్కువగా అనుభవిస్తున్నారని ఒకవర్గం అనవసర గ్లోబల్ ప్రచారం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి తెలుగు రాష్ట్రాల్లో మాదిగల కన్నా మాలల జనాభానే ఎక్కువని అత్యంత వెనకబడి ఉంది కూడా మాలలే అన్నారు. వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా 33 జిల్లాలు పర్యటించి మాలలను చైతన్యపరిచి హైదరాబాద్ కేంద్రంగా మా జనాభా చూపించుకునేందుకు లక్షల మందితో భారీ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జంగ శ్రీనివాస్, శంకర్, కిషన్, సుధీర్, రంగ, లలిత, బ్రహ్మ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు వినతి

మియాపూర్: కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీలో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులను చేపట్టాలని కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాలనీలో అసంపూర్తిగా మిగిలిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో దేవేందర్‌రావు, విరూపాక్షయ్య, బాలు చౌదరి, బీఆర్ చౌదరి తదితరులున్నారు.



కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132